క్లుప్తంగా

26న సామూహిక లింగాష్టకమ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 26న 108 మంది భక్తులతో సామూహిక లింగాష్టకమ్, గోవింద నామస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మనగుడి – మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి సమేత చిన్నవెంకన్నబాబు పీఠం, మనగుడి–మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి, సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో వేద పండితులు, భక్తుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గాదాలలోని మహాలక్ష్మీ సమేత చిన్నవెంకటేశ్వరస్వామి పీఠం అధ్యక్షుడు డాక్టర్ శ్రీమాన్ చిన్న వెంకన్నబాబుకు ఉభయ రాష్ట్రాల్లోని శిష్యబృందంతో జీవన సాఫల్య సత్కారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ సహాయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, జాతీయ చైర్మన్ ధరణికోట దుర్గా వెంకట హైమావతి పాల్గొన్నారు.

9న విజయవాడలో ధర్నా

ప్రకాశం నగర్: అశాస్త్రీయమైన టార్గెట్లకు నిరసనగా మార్చి 9న విజయవాడ పోస్టల్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.కొండబాబు తెలిపారు. రాష్ట్ర ఐక్యకార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు గురువారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం దగ్గర నాలుగోరోజు నిరసన కొనసాగించారు. కొండబాబు మాట్లాడుతూ అధికారుల ఒత్తిడి కారణంగా మచిలీపట్నం తపాలా డివిజన్‌లో ఒక ఉద్యోగి మరణించారన్నారు. తపాలాశాఖ ఉన్నతికి ప్రతి ఉద్యోగి కృషి చేస్తున్నప్పటికీ, అధికారులు బెదిరించే ధోరణితో ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలను విధిస్తున్నారని విమర్శించారు.

వైద్యశిబిరం

కడియం: కడియపులంకలోని పుల్లా ఆంజనేయులకు చెందిన సత్యదేవ నర్సరీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. నర్సరీ రైతు పుల్లా రాజశేఖర్ పుట్టిన రోజును పురస్కరించుకుని కూలీలు, పలువురు నర్సరీ రైతులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎంసీ ఆటలపోటీలు

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులకు ఆర్ఎంసీ – 2023 పేరిట ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిషనర్ కె.దినేష్ కుమార్ గురువారం ప్రకటన విడుదల చేశారు. క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, చదరంగం, క్యారమ్స్ తదితర వాటిలో పురుషులకు, మహిళలకు రెండు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి

సీటీఆర్ఐ: ప్రత్యామ్నాయ స్థలం చూపించకుండా జియోన్ అంధుల పాఠశాలను తరలించవద్దంటూ మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. జియోన్ అంధ విద్యార్థులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరం వద్ద గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీకి తాము వ్యతిరేకం కాదని, కాని అంధ విద్యార్థులను రోడ్డున పడేయడం సమంజసం కాదన్నారు.

వీరభద్రస్వామి మహాసంబరం



పూజలో పాల్గొన్న షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక పుష్కరాల రేవులోని వీరభద్రస్వామి ఆలయంలో గురువారం మహాసంబరం నిర్వహించారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ చేసి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకం, పంచహారతి, అనంతరం సంబరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మేకా బ్రహ్మాజీ, అశ్విని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి హైవే నిర్మాణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. మోరంపూడి, సాయినగర్, అరవింద్ నగర్, గాదాలమ్మ నగర్, హుకుంపేట, మీనాక్షి లేఅవుట్, హనుమాన్ నగర్, వెంకటగిరి –2, హుకుంపేట ఎస్సీపేట, జైహింద్ నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- గ్రామాల్లో ఆటలమ్మ, గవదబిళ్లల కేసులు
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: వేసవికాలం ప్రారంభమైతే చాలు చికెన్‌ఫాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. మార్చి నెలలోకి అడుగుపెట్టకముందే ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్‌ఫాక్స్, గవదబిళ్లల సమస్య కనిపిస్తోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశమున్నా ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుంది. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా



ఆటలమ్మ సోకిన దృశ్యం

తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకిన వారిని మిగతావారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వడం మంచిది. గవదబిళ్లలు వచ్చినవారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరుచూ ద్రవపదార్థాలను ఇవ్వాలి. చికెన్‌పాక్స్, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి, ధవళేశ్వరం పీహెచ్‌సీ

ఆర్వోబీ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్



అన్నపూర్ణమ్మపేటలో ఆర్వోబీ నిర్మాణంపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్
- పరిశీలించిన రైల్వే అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని అన్నపూర్ణమ్మ పేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఈ మేరకు రైల్వే శాఖ ఆదేశాలు, సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల సూచనలపై బెజవాడ నార్త్ సీనియర్ డీన్ ఉన్నం అక్కిరెడ్డి ఇక్కడకు పరిశీలనకు వచ్చారు. ఆర్వోబీ నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలు, నిర్ణయాలపై ఎంపీ భరత్‌రామ్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఇతర రైల్వే ఇంజినీర్లు, మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా అక్కిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల బెజవాడ – విశాఖ నుంచి వెళుతున్న రైళ్ల వేగాన్ని 110 కేఎం నుంచి 130 కేఎంకు పెంచారని, ఈ క్రమంలో లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఆర్వోబీలు నిర్మించాలని కేంద్ర రైల్వే శాఖ నిర్ణయించిందన్నారు. ఎంపీ భరత్‌రామ్ ఇక్కడ ఆర్వోబీ నిర్మించాల్సిన ప్రాధాన్యతను రైల్వే శాఖమంత్రికి తెలియజేయడంతో డీపీఆర్ పథకంలో ఈ ఆర్వోబీ మంజూరైందన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతి ఇస్తే, ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ, తొలగించాల్సిన భవనాలు ఏమైనా ఉంటే వాటి యజమానులకు నష్టపరిహారం తదుపరి వ్యయాన్ని కేంద్ర రైల్వేశాఖ మంజూరు చేస్తుందన్నారు. ఈ వారంలోనే నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

ప్రజలకు ఎంతో సౌకర్యం

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఇక్కడ ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకే కాకుండా నగర ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రైళ్ల రాకపోకలు కారణంగా తరచూ ఎల్సీ గేటు మూయడంతో వాహనచోదకులకు చాలా సమయం వృథా అవుతోందన్నారు. 400 మీటర్ల పొడవు, 9.5 మీటర్ల ఎత్తులో ఆర్వోబీ నిర్మాణం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారన్నారు. రాజమహేంద్రవరం ఏ డీన్ గణేషన్ ముత్తుస్వామి, రైల్వే వర్క్స్ ఎస్ఎస్ఈలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రసాద్, సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎస్వీ శ్రీనివాస్, మజ్జి అప్పారావు, మజ్జి నూకరత్నం, బురిడి త్రిమూర్తులు, కురిమిల్లి శాంతి స్వరూప్, బిల్డర్ చిన్న, కాటం రజనీకాంత్ పాల్గొన్నారు.

బెస్ట్ గైడ్ టీచర్‌గా రామాంజనేయులు

కంబాలచెరువు: మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కేఎస్ఆర్ రామాంజనేయులుకు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో గురువారం ధ్రువపత్రం అందుకున్నారు. ఇటీవల గుజరాత్‌లో జరిగిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో మద్దూరు పాఠశాల సైన్స్ ప్రాజెక్ట్ గ్రీన్ ఏసీ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో అక్కడి శాస్త్రవేత్తలో పలు అంశాలపై చర్చలు, సెమినార్లలో ఆయన పాల్గొని ఉత్తమ గైడ్ టీచర్‌గా ఘనత సాధించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ చైర్మన్ డాక్టర్ లలిత్ శర్మ, భారత ప్రభుత్వం తరఫున సుజిత్ బెనర్జీ సర్టిఫికెట్ పంపించారు. కాగా.. రామాంజనేయులును అర్బన్ రేంజ్ డీఐ బి.దిలిప్ కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ఎస్ నెహ్రూ, కన్నూరి సతీష్ బాబు, మద్దూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.సుబ్బలక్ష్మి అభినందించారు.



బెస్ట్ గైడ్ టీచర్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న డీఈవో అబ్రహం

పోసికుమార్ నియామకంపై హర్షం

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముత్యాల పోసికుమార్ నియమితులు కావడంపై వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), డాక్టర్ చొల్లంగి సత్యగిరి, శ్రీరంగం బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

లార్డ్ బెడెన్ పాల్ జయంతి

ప్రకాశం నగర్: దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గురువారం వ్యవస్థాపకుడు లార్డ్ బెడెన్ పాల్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో ఎస్.అబ్రహ్మాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కె.శర్మ, డి.ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే పురోభివృద్ధి

- త్వరలో నగరంలో డ్వాక్రా, మెప్మా బజార్లు
- ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమనేది ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్ రెడ్డి నమ్మకమని, ఆ దిశగానే సీఎం చర్యలు చేపడుతున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. 38వ డివిజన్ సీతంపేటలో వైఎస్సార్ సీపీ వార్డు గృహసారథులు, మహిళలతో గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే తన సంకల్పమన్న సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాలతో అనుకున్న లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద డ్వాక్రా, మెప్మా బజార్లు ఏర్పాటు చేయించాలనేది తన ఆలోచన అన్నారు. ఆయా సెంటర్ల వద్ద ఖాళీ స్థలాలను సేకరించి షాపులు నిర్మించి మీకు కేటాయిస్తామని మహిళలకు ఎంపీ తెలిపారు. మీరు తయారు చేసే పచ్చళ్లు, పిండి వంటలు, అల్లికలు, పేపర్ ప్లేట్లు తదితర వాటిని విక్రయించుకోవచ్చన్నారు. నగరంలోని 42 డివిజన్లలో దాదాపు 40 వేల మంది డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యే దిశగా ముందడుగు వేస్తున్నారని, ఇదొక విప్లవాత్మకమైన మార్పు అన్నారు. అనంతరం ఆ వార్డు మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి అరిగెల బాబు, పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, గుర్రం గౌతమ్, పాలిక శ్రీను, డాక్టర్ అనసూరి పద్మలత, కట్టా వెంకటేష్, సుంకర అంజిబాబు, గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ నాగేశ్వర్
- జూనియల్ కళాశాల నిర్మాణం పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నాడు –నేడు పథకంలో జరుగుతున్న జూనియర్ కళాశాల నిర్మాణ పనులను గురువారం వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరిశీలించారు. రూ.1.40 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరికి సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ

కడియం: గ్రామానికి చెందిన వనుం గోవింద్ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం పరామర్శించారు. పలు సేవా కార్యక్రమాల్లో ముందుండే గోవింద్ హఠాన్మరణంపై విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి సానుభూతిని తెలిపారు. చందన వెంట మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, స్థానిక నాయకులు శాకా పట్టాభి, గుత్తుల వాసు, సత్తిబాబు, పెంకే రామకృష్ణ, సర్కార్ బాషా, రామకృష్ణ, చంద్రరావు, మణికంఠ ఉన్నారు.



శాటిలైట్‌సిటీలో జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

పల్లిజాన్ మృతిపై విచారణ జరిపించాలి

- తొర్రేడు సెంటర్‌లో కుటుంబ సభ్యుల ధర్నా
- నార్త్‌జోన్ డీఎస్పీ హామీతో విరమణ

రాజమహేంద్రవరం రూరల్: మిర్తిపాడు గ్రామంలో నూతిలో పడి పల్లిజాన్ (22) మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలంటూ అతని కుటుంబ సభ్యులు, ఎస్సీ నాయకులు గురువారం తొర్రేడు సెంటర్‌లో ధర్నా చేశారు. తొర్రేడుకు చెందిన పల్లిజాన్ ఈనెల 12వ తేదీన సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో నూతిలో శవమై కనిపించాడు. ఈ మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. పల్లిజాన్ మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఎస్సై దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఎస్సై పట్టించుకోవడం లేదంటూ తొర్రేడు జంక్షన్‌లో ఈనెల 15న ఎస్సీ సామాజిక వర్గీయులందరూ ధర్నా చేశారు. దీంతో సీతానగరం ఎస్సై శుభశేఖర్ పది రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే బుధవారం ఎస్సై శుభశేఖర్ ఫోన్‌చేసి.. జాన్ నూతిలో పడిలో చనిపోయాడని, ఏమైన ప్రభుత్వ పథకాలు వర్తిస్తే పెట్టుకోండి అంటూ దురుసుగా మాట్లాడారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో గురువారం ఉదయం తొర్రేడులో సీతానగరం రహదారిపై ధర్నా నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించడంతో సంఘటనా స్థలానికి నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు చేరుకుని ఎస్సీ నాయకులు, మాజీ సర్పంచ్ ఉప్పులూరి సత్యనారాయణతో మాట్లాడారు. నెల రోజుల్లో విచారణ పూర్తయ్యేలా చూస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు. అలాగే ఎస్సై శుభశేఖర్‌పై చర్యలకుపై అధికారులకు నివేదిస్తామన్నారు. సదరు హామీతో ధర్నాను మధ్యాహ్నం విరమించారు.



తొర్రేడులో ధర్నా చేస్తున్న పల్లిజాన్ కుటుంబ సభ్యులు, ఎస్సీ నాయకులు

మాజీ సర్పంచ్ సత్యనారాయణ మృతి



రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ కుడుపూడి సత్యనారాయణ (74) గురువారం మృతిచెందారు. ఆయనకు భార్య పుష్పవతి, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుడుపూడి సత్యనారాయణ రాజమహేంద్రవరం మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా, శాటిలైట్‌సిటీ సర్పంచ్‌గా 2002 నుంచి 2012 వరకు సేవలందించారు. ఆయన భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఆంజనేయస్వామి దీక్ష విరమణ

కడియం: కడియపులంకలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మాలలు ధరించి, తొమ్మిది రోజులు దీక్షలు చేసిన భక్తులు గురువారం దీక్షలను విరమించారు. ఆలయంలో ఇరుముడులు సమర్పించారు. స్వామివారి ఆలయం 73వ వార్షికోత్సవాన్ని పురస్కరించుని ఇటీవల ప్రత్యేక పూజలు, భారీ అన్నదానం, సువర్చలా ఆంజనేయ స్వామివార్ల కల్యాణం నిర్వహించిన విషయం విదితమే. ఈ కార్యక్రమాల్లో భాగంగా 158 మంది భక్తులు స్వామివారి మాలలు ధరించి, ఆయా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి ఆలయం ఏర్పడిన నాటి నుంచే ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం తెలిపారు.



దీక్ష విరమణ సందర్భంగా పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎంపీడీవో రత్నకుమారి దంపతులకు పరామర్శ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుత్ర శోకంతో బాధపడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో కె.రత్నకుమారి, మట్టా శ్యాం సుందర్ దంపతులను గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. స్థానిక స్వరాజ్య నగర్‌లోని వారి స్వగృహానికి వెళ్లి ముందుగా సందీప్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే రత్నకుమారి దంపతులను వివిధ పార్టీల నాయకులు, అధికారులు పరామర్శించారు.

ఎంపీడీవోకు పరామర్శ

కడియం: పుత్ర వియోగంతో బాధపడుతున్న కడియం ఎంపీడీవో కె.రత్నకుమారిని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ గురువారం ధవళేశ్వరంలో పరామర్శించారు. సావరం సర్పంచ్ చక్కపల్లి మురళీకృష్ణ, ఎంపీటీసీలు నాగిరెడ్డి రామకృష్ణ, విత్తనాల సాయికుమార్, పుచ్చల బసవశంకరం తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



రత్నకుమారి దంపతులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని పార్శిల్ కార్యాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 55 ఏళ్లు) మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. విషయం తెలిసిన రైల్వే పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలతో ప్రగతి సాధించాలి

రాజానగరం: బ్యాంకు లింకేజీ రుణాలతో జీవనోపాధిని మెరుగుపర్చుకుని ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధిని సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి అన్నారు. మండలంలోని శ్రీరామపురంలో గురువారం నిర్వహించిన స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, సకాలంలో తిరిగి చెల్లింపులు జరిగితే మరి కొందరికి పరోక్షంగా సహాయపడిన వారవుతారన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలను అనుసరించి, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఏవిధంగా వినియోగించుకుంటున్నారు, తద్వారా వారి ప్రగతి ఏవిధంగా ఉంటుంది అనే విషయాలను పరిశీలించడంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఆయా సంఘాల పనితీరు, వ్యాపార లావాదేవీలపై ఆరా తీశారు.

సారా తయారీకి బ్రేకులు వేద్దాం

రాజానగరం: సారాను అరికట్టడానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు అన్నారు. సారా తయారీకి బ్రేకులు వేయాలంటే వర్తకుల సహకారం ఎంతో అవసరమన్నారు. తయారీదారులకు నల్లం బెల్లం చేరకుండా డిపార్టుమెంట్‌కు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక అన్నదాన సత్రం కల్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సౌత్ స్టేషన్ ఎస్సై ఎం.రామశేషయ్య, రాజానగరం వర్తక సంఘం ఉపాధ్యక్షుడు లంక శ్రీనివాస్, ప్రగడ చక్రి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఇదాకిని కథయారథం'

- ముగిసిన భారత్ రంగ్ మహోత్సవం
- అలరించిన నాటకాలు

సీటీఆర్ఐ: వలసదారుల ఆవేదన, కష్టాలు, బాధలను ఇదాకిని కథయారథం నాటకం కళ్లకు కట్టినట్లు చూపించింది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో 22వ భారత్ రంగ్ మహోత్సవం వేడుకలలో భాగంగా రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటక ప్రదర్శనలు ఐదో రోజు గురువారంతో ముగిశాయి. చివరిరోజు తమిళనాడు మంగు థియేటర్ ల్యాండ్ బృందం ఆధ్వర్యంలో మురుగు బూపతి దర్శకత్వంలో ఇదాకిని కథయారథం నాటకం ప్రదర్శమైంది.

అభినందనీయం

రాష్ట్ర సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రాంతీయ సంస్థ కార్యాలయం ఏర్పాటు ద్వారా మన ప్రాంతంలోని కళాకారులకు ఎంతో ఉపయోగం ఉంటుందని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన భారత్ రంగ్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు భారత్ రంగ్ మహోత్సవ్ 2023 (థియేటర్ ఫెస్టివల్) అత్యంత ఘనంగా జరిగిందన్నారు. విభిన్న రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రాంతాన్ని ప్రతిబింబించేలా ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయన్నారు. పబ్లిక్ రిలేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ హర్షభార్గవి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఆనందించదగిన విషయమన్నారు. ఎన్ఎస్‌డీ (ఢిల్లీ) జ్యోలా ప్రసాద్ మాట్లాడుతూ కళలను భవిష్యత్తు తరాలకు అందించటానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్.మల్లికార్జునరావు, ఎన్ఎస్‌డీ బెంగళూరు సెంటర్ డైరెక్టర్ వీణాశర్మ, రాజమహేంద్రవరం ఫెస్టివల్ ఇన్‌చార్జి డైరెక్టర్ వెట్రి భూపతి తదితరులు కళారంగంలో విశిష్ట సేవలు అందించిన అవిరెడ్డి జయశ్రీ, ఆర్.నిరూపమ, కె.శాంతి కుమారి, రౌతు వాసుదేవరావు, తాళ్ల బత్తుల వెంకటేశ్వరరావు, దంటు భాస్కరరావులను సత్కరించారు. ఈ సందర్భంగా వసుమర్తి శ్రీనివాసు శర్మ రచించిన కూచిపూడి నాట్య కౌమది పుస్తకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు.



నాటకంలో ఓ సన్నివేశం